సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



15న జాబ్‌మేళా

పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. 8లో



ఉత్తమ ఫలితాలే లక్ష్యం 8లో

టెన్త్ విద్యార్థులు పదికి పది పాయింట్లు సాధనే లక్ష్యంగా ప్రత్యేక బోధన అందించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు.



ఘనంగా సహస్ర దీపార్చన

పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దు

- రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్



బందపల్లిలో రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ఏజెన్సీలో రైతుల దళారులను నమ్మి తక్కువ రేటుకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మండలంలోని బందపల్లి, తాటివాడ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. విక్రయించిన వారం నుంచి పది రోజుల్లో నగదు నేరుగా ఖాతాల్లో జమ అవుతుందన్నారు. క్వింటా ధాన్యం రూ.2183, 75 కిలోలు రూ.1637 ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. వర్షాలకు తడిచి రంగు మారిన ధాన్యాన్ని కూడా రైతు భరోసా కేంద్రంలో కొనుగోలు చేస్తున్నందున రైతులు అధైర్య పడవద్దన్నారు. గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలు ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ విషయాలను రైతులకు వ్యవసాయ సిబ్బంది తెలియజేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రామవరం



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళి, సీఐ గజేంద్రకుమార్

చింతూరు: స్థానికంగా 45 రోజులపాటు నిర్వహించిన అల్లూరి సీతారామరాజు మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నమెంటు విజేతగా వీఆర్‌పురం మండలం రామవరం జట్టు నిలిచింది. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం ఎటపాక మండలాలకు చెందిన 80 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంటు ఫైనల్లో రామవరం, చింతూరు మండలం నిమ్మలగూడెం జట్లు తలపడ్డాయి. రామవరం జట్టు నిమ్మలగూడెం జట్టుపై 37 పరుగుల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, సీఐ గజేంద్రకుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ఎస్ఐ శ్రీనివాసరావు, నాయకులు చిన్నారెడ్డి, రమణారెడ్డి, రాజు, కమిటీ సభ్యులు ప్రదీప్, సూరి, దశరథ్, శేఖర్ పాల్గొన్నారు.

త్వరితగతిన 'ఏకలవ్య' భవన నిర్మాణం

- ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన



నక్కలపుట్టులో ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న బిపిన్ చంద్ర, అధికారులు

హుకుంపేట: ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని కేంద్ర కమిటీ జాయింట్ కమిషనర్ బిపిన్ చంద్ర రతుని పేర్కొన్నారు. మండలంలో మట్టుజోరు పంచాయతీ నక్కలపుట్టులో ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణం చేపట్టే స్థలాన్ని మంగళవారం ఆయన కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి స్వచ్ఛందంగా 11.87 ఎకరాలకు అందజేసిన రైతులను ఆయన అభినందించారు. వెంటనే పనులు చేపట్టేలే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సర్పంచ్ సీదరి సాంబ పాల్గొన్నారు.

కరాటేలో గిరి విద్యార్థిని ప్రతిభ



ప్రశంసాపత్రంతో గాయత్రి

రంపచోడవరం: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో దేవీపట్నం మండలం పాముగండి గ్రామానికి చెందిన మడి గాయత్రి ప్రతిభ కనబరిచింది. కాకినాడలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఈమె ప్రథమస్థానం సాధించినట్టు ఆమె తండ్రి రాజన్నదొర తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

వైద్యసేవల్లో మేటి

జిల్లాలోని తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అరుదైన గుర్తింపు లభించింది. రోగులకు అందిస్తున్న సేవలను జాతీయ నాణ్యత అంచనా ప్రమాణాల కమిటీ గుర్తించింది. రాష్ట్రంలో మూడు పీహెచ్‌సీలు ఎంపిక కాగా వీటిలో తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకటి.

- తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అరుదైన గుర్తింపు
- నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికేషన్ జారీ
- రాష్ట్రంలో ఎంపికైన మూడింటిలో ఒకటి



తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సేవలందిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

చింతపల్లి రూరల్: రోగులకు సేవలు అందించడంలో మండలంలోని తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆదర్శంగా నిలుస్తోంది. మిగతా ఆరోగ్య కేంద్రాల కన్నా భిన్నంగా.. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చేలా ఇక్కడి వైద్యులు, సిబ్బంది అంకితభావంతో సేవలందిస్తున్నారు. ప్రజలు కూడా వీరు అందించే సేవల పట్ల సంతృప్తి చెందుతున్నారు. వీటిని మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో జాతీయ నాణ్యత అంచనా ప్రమాణాల కమిటీ గుర్తించింది. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎన్‌హెచ్‌ఎం మిషన్ డైరెక్టర్ అదనపు కార్యదర్శి ఎస్.చాంగ్‌సన్ మంగళవారం నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికేషన్ (ఎన్‌క్యూఏఎస్)జారీ చేశారు. దీనిని రాష్ట్ర మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మెయిల్ ద్వారా పంపించినట్టు పీహెచ్‌సీ ఇన్‌చార్జి కేఎస్ కుమార్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు మరో వైద్యాధికారి భవాని, సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్‌బాషా అభినందించారు.

లక్ష్యం నెరవేర్చేలా..

- తాజంగిలో ప్రతి గురువారం జరిగే వారపు సంత రోజున ఆస్పత్రికి 50 నుంచి 60 మంది వరకు రోగులు వస్తున్నారు. మిగతా రోజుల్లో ప్రతిరోజు ఓపీకి 15 నుంచి 20 మంది మాత్రమే వస్తుంటారని ఆస్పత్రి అధికారవర్గాలు తెలిపాయి.

ఏడు విభాగాల పనితీరు ఆధారంగా.. : ఏడు విభాగాల పనితీరు ఆధారంగా జాతీయ నాణ్యత అంచనా ప్రమాణాల కమిటీ తాజంగి పీహెచ్‌సీని ఎంపిక చేసింది. వీటిలో గిరిజనులకు అందిస్తున్న వైద్యం, ల్యాబరేటరీ, ఫార్మసీ మందుల విభాగం, సీజనల్ వ్యాధులపై అవగాహన, వైద్య శిబిరాల నిర్వహణ, రోగులకు సకాలంలో మెరుగైన సేవలు, రోగుల స్పందన, ప్రసవ సేవలు వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంది.

- పీహెచ్‌సీ పరిధిలో ఐదు సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో తాజంగి, కొత్తపాలెం, వంజరి, అంజలి శనివారం పంచాయతీల్లోని 94 గ్రామాలు ఉన్నాయి.
- పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, 84 మంది ఆశా వర్కర్లు, మిగిలిన విభాగాల్లో 40 మంది సేవలందిస్తున్నారు.
- వైద్య శిబిరాలు నెలకు 10 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నారు. వీటిలో 10 వరకు ఫ్యామిలీ ఫిజీషియన్, మిగతా ఐదింటిని అవసరమైన గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. ఒక్కో శిబిరంలో 50 నుంచి 60 మంది వరకు వైద్యసేవలు పొందుతున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాధుల పట్ల ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.
- ప్రతి నెలా సుమారు 250 మంది గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారు.



గ్రామాల్లో వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



వైద్యశిబిరం నిర్వహిస్తున్న తాజంగి సిబ్బంది



గ్రామాల్లో సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

బాధ్యత పెంచింది



పీహెచ్‌సీలో ఉత్తమ సేవలను గుర్తించి క్వాలిటీ సర్టిఫికేషన్ ఇవ్వడం తమపై మరింత బాధ్యత పెంచింది. ప్రస్తుతం ఆరు పడకలు మాత్రమే ఉన్నాయి. సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అదనంగా నిధులు విడుదల చేసే అవకాశం ఉంది.

– కేఎస్ కుమార్‌బాబు, సివిల్ అసిస్టెంట్ సర్జన్

గుర్తింపు శుభపరిణామం



ప్రజలకు అందిస్తున్న సేవలను జాతీయ నాణ్యత అంచనా ప్రమాణాల కమిటీ గుర్తించడం శుభపరిణామం. మిగతా పీహెచ్‌సీలు కూడా ప్రజలకు ఆదర్శవంతమైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం. తాజంగి పీహెచ్‌సీలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– జమాల్‌బాషా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

18 నుంచి సివిల్స్‌కు ఉచిత శిక్షణ

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ ద్వారా సివిల్స్, గ్రూప్–1,గ్రూప్–2 పరీక్షలు రాసేందుకు ఎంపిక చేసిన అభ్యర్థులు 17న రంపచోడవరం యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో హాజరు కావాలని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. మొదటి, రెండో లెవెల్ పరీక్షలు ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రంపచోడవరం డివిజన్‌లో 45 మంది, చింతూరు డివిజన్‌లో 19 మందిని ఎంపిక చేశామన్నారు. ఉచిత శిక్షణకు ఎంపికైన అభ్యర్థుల జాబితా స్థానిక ఐటీడీఏ నోటీస్ బోర్డు, వైటీసీలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి అనుభవజ్ఞులతో శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.

చింతూరు ఐటీడీఏ పరిధిలో..

చింతూరు: డివిజన్లోని గిరిజన నిరుద్యోగ యువతకు సివిల్ సర్వీసు, గ్రూప్–1,2 ఉచిత శిక్షణకు సంబంధించి ఇటీవల నిర్వహించిన రాతపరీక్షల తుది ఫలితాలను స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో కావూరి చైతన్య మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతూరు ఐటీడీఏ పరిధిలో ఉచితశిక్షణ నిమిత్తం 153 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. వీరికి మూడు దశల్లో రాత పరీక్షలు నిర్వహించగా చింతూరు నుంచి 19 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 17 సాయంత్రం ఐదు గంటల్లోపు రంపచోడవరం యూత్ ట్రెనింట్ సెంటర్లో రిపోర్టు చేయాలని, 18 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పీవో పీవో పేర్కొన్నారు. అభ్యర్థులకు సంబంధించిన తుది జాబితాను స్థానిక ఐటీడీఏ కార్యాలయ నోటీసుబోర్డులో ఉంచినట్టు ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా వరుదు కల్యాణి



వరుదు కల్యాణి



కొండా రాజీవ్



చెట్టి వినయ్

దొండపర్తి(విశాఖ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు రాష్ట్ర కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఇందులో రాష్ట్ర మహిళా విభాగం కమిటీలో విశాఖ జిల్లా నుంచి తొమ్మిది మందికి చోటు కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మంతెన మాధవీవర్మ, జోనల్ ఇన్‌చార్జ్‌లుగా బి.పద్మావతి, పీలా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా మళ్ల దేవీవిశాలాక్షి, పెనుమత్స శ్రీదేవివర్మ, కార్యదర్శి ముదుండి రాజేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా నీలాపు లక్ష్మి, కొనల విజయ వినీతలను నియమించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కోరబ్ అనూషదేవిని రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లాకు చెందిన రొంగల నారాయణమ్మను రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా కొండా రాజీవ్

రాష్ట్ర యువజన విభాగ కమిటీలో విశాఖ నుంచి నలుగురికి ప్రాతినిధ్యం కల్పించారు. ఇందులో రాష్ట్ర యువజన విభాగ కమిటీ ఉపాధ్యక్షుడిగా కొండా రాజీవ్‌గాంధీ, జోన్–2 జోనల్ ఇన్‌చార్జిగా ముత్తంశెట్టి వెంకట శివసాయి నందీష్, కార్యదర్శిగా అంబటి నాగ వినాయక శైలేష్, సంయుక్త కార్యదర్శిగా కండిపల్లి సతీష్‌కుమార్ నియమితులయ్యారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి రాష్ట్ర యువజన విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చెట్టి వినయ్, కార్యదర్శిగా చిక్కుడు చిన్నారావులను నియమించారు.

అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మారేడుమిల్లి : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టు భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే మంగళవారం తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలలో 2023–24కుగాను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆయన తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఏ బీఈడీలో 50 శాతం మార్కులు కలిగి ఏపీ టెట్ అర్హత ఉండాలన్నారు. రెండు లెవెల్స్‌లో ఇంగ్లీష్ మీడియం చదివి ఉండాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో విద్యార్హత, డెమో ద్వారా వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20లోగా స్థానిక ఏపీఆర్ పాఠశాలలో దరఖాస్తు అందజేయాలని ఆయన సూచించారు.

'అనంత' కాంతులు

- దేదీప్య మానంగా దీపోత్సవం
- దీప కాంతుల్లో పద్మనాభుడు

8లో

జగనన్నతో సాధ్యమైన గ్రామ స్వరాజ్యం



సలుగు గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అధికారులు, పార్టీ శ్రేణులు

- ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- సలుగులో గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

పాడేరు రూరల్ : గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె సలుగు గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు నేరుగా గడపవద్దకే అందించాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేశారన్నారు. ఒక పక్క ప్రజలకు సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మరోపక్క గ్రామ సచివాలయాల్లో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు సాధ్యమయ్యాయన్నారు. గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు గడప వద్దకే అందిస్తున్న ఏకైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా ఎంతో పారదర్శకంగా అన్ని రకాల పథకాలు గడప వద్దకే అందుతుండటంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. నవరత్నాల పథకాలతో ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకే అత్యధిక లబ్ధి చేకూరుతుందన్నారు. గ్రామాల్లో సామాజిక, వ్యక్తిగత సమస్యలను సచివాలయం దృష్టికి తీసుకువస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి నవీన్, పీఆర్ ఏఈ బాబుప్రసాద్, సర్పంచ్ గెమ్మెలి అప్పలకొండ, ఎంపీటీసీలు చిప్పాడ మీనా, కుంతూరు నర్సింహమూర్తి, పాడేరు ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, సర్పంచ్‌లు కిల్లు పరమేశ్వరి, పాంగి రాంబాబు, గ్రామ సచివాలయ కన్వీనర్లు రంగసింగి రామునాయుడు పాల్గొన్నారు.

బాధిత రైతులకు అండగా..

- తుపాను పంట నష్టంపై సమగ్ర సర్వే
- ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన అధికార యంత్రాంగం
- జిల్లాలో వరి, మిరప, పత్తి పంటలపై ప్రభావం ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తింపు
- ధాన్యం కొనుగోళ్లపైనా ప్రత్యేక దృష్టి
- ఇప్పటివరకు 850 టన్నుల కొనుగోలు



ఎటపాక మండలం కన్నలగూడెంలో తుపానుకు దెబ్బతిన్న మిరప పంటను పరిశీలిస్తున్న సర్వే బృందం

సాక్షి,పాడేరు: మిచాంగ్ తుఫాన్‌తో జిల్లాలోని పంట నష్టాలతో ఆందోళన చెందుతున్న బాధిత రైతులకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖ,రెవెన్యూ యంత్రాంగం సంయుక్తంగా మంగళవారం నుంచి పంట నష్టాల సర్వేకు శ్రీకారం చుట్టాయి.

- జిల్లాలోని పాడేరు,రంపచోడవరం డివిజన్‌ల పరిధిలోని లోతట్టు భూముల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పొలంలో నీరు చేరిందని వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. ఈ కారణంగా కొన్ని చోట్ల వరిపనలు తడిచి పోవడం వల్ల గింజలు రాలిపోయాయి. బాధిత రైతుల సమక్షంలోనే పంట నష్టం వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారు.
- పాడేరు డివిజన్‌లోని రాజ్‌మా, ఇతర వాణిజ్య, కూరగాయల పంటలపై కూడా తుపాను ప్రభావం చూపింది. చింతూరు డివిజన్ పరిధిలో ప్రధానంగా మిరప, పత్తి పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఇచ్చిన సమాచారం గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఎటపాక, వీఆర్ పురం,కూనవరం మండలాల్లో మిరప, పత్తి పంటలకు జరిగిన నష్టాన్ని ఈ క్రాఫ్ నమోదు ఆధారంగా గుర్తిస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

తుపానుకు తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించడం రైతులకు ఊరటనిచ్చింది. దేవీపట్నం, రంపచోడవరం, గంగవరం, రాజవొమ్మంగి మండలాల పరిధిలోని ఆర్‌బీకే కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిరంతరం పనిచేస్తున్నాయి.

- పౌరసరఫరాలశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఆర్‌బీకేల వ్యవసాయ అసిస్టెంట్లు నేరుగా రైతుల కల్లాల వద్ద వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వాటిని వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అవసరమైన గోనెసంచులను జిల్లా అధికార యంత్రాంగం అందుబాటులో ఉంచింది.ఇప్పటివరకు రైతుల నుంచి 850 టన్నుల ధాన్యంను కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాలశాఖ డీఎం గణేష్ తెలిపారు.



చెన్నంపేటలో ముంపునకు గురైన వరి పంటను పరిశీలిస్తున్న వీఆర్వో



చింతపల్లి మండలం బలపంలో రాజ్‌మా పంట నష్టాన్ని పరిశీలిస్తున్న సర్వే బృందం



దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో ధాన్యం కొనుగోలు చేస్తున్న సిబ్బంది

ప్రతిభ కనబరిచిన గిరిజన అభ్యర్థులకు ఉచిత కోచింగ్

- రిషీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం.మురళీకృష్ణ



కొయ్యూరు: గ్రూపు 1,2 పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులకు ఈ నెల 17న నిర్వహిస్తున్న అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిచిన మొదటి పది మందికి ఉచితంగా శిక్షణ ఇస్తామని నర్సీపట్నానికి చెందిన రిషీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. జనరల్ స్టడీస్ పేపరు 150 మార్కులకు అభ్యర్థులు రాయాల్సి ఉంటుందన్నారు. మిగిలిన అభ్యర్థులకు ఫీజులో పదిశాతం రాయితీ ఇస్తామని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ అభ్యర్థులకు 40 శాతం, బీసీ అభ్యర్థులకు 45 శాతం, ఓసీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు తెచ్చుకుంటే వారికి కూడా ఫీజులో పదిశాతం రాయితీ ఉంటుందని తెలిపారు. పరీక్ష ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. పూర్తి వివరాలకు 8106450108, 866290416 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేసిన వారికి పండ్ల రసం ఇస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మి

రంపచోడవరం: రంపచోడరవం ఏరియా ఆస్పత్రిలో రెండు రోజులు పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది స్వచ్ఛందంగా 15 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి మాట్లాడుతూ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వలు పెంపునకు సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారన్నారు. రక్త దానం ప్రాణదానంతో సమానమన్నారు. దాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలన్నారు. రక్త దానం చేసిన వారిని అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడిన ట్రాక్టర్ తొట్టి

రాజవొమ్మంగి: మండలంలోని నెల్లిమెట్ల -లబ్బర్తి మధ్య చిన్నేరు వాగు కల్వర్టు పైనుంచి మంగళవారం కలప లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి సమీపంలోని వాగులో బోల్తా పడింది. స్థానికులు ప్రయాసతో వాహనాన్ని బయటకు తీశారు. ఘటనలో డ్రైవర్‌కు ప్రమాదం జరగలేదు. కల్వర్టు శిథిలమైందని, నిలిచిన నీటితో నాచు పేరకుపోయి ఈ ప్రాంతంలో తరచూ వాహనాలు జారి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెప్పారు. అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

ఓటు హక్కుపై అవగాహన



ఏపీఆర్ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌డీసీ శర్మ

సాక్షి,పాడేరు: ఓటు హక్కు వినియోగంపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వి.ఎస్.శర్మ విద్యార్థినీలకు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక ఏపీఆర్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థినీలకు పార్లమెంట్,అసెంబ్లీ నియోజకవర్గాలు,ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ నియోజకవర్గాల ఏర్పాటుపైన ఆయన సమగ్రంగా వివరించారు.

సంక్షేమ ప్రదాత సీఎం జగన్



సలుగు గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



కురిడి పంచాయతీలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ

పాడేరు రూరల్ : దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. మండలంలోని సలుగు గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. సర్పంచ్‌లు అప్పల కొండ, పి.రాంబాబు, వి.రాంబాబు, కె.పరమేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు సీహెచ్.మీనా, కె.నర్సింహమూర్తి, డి.సన్యాసిరావు, మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి, కొర్రాయి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీను గెలిపించి, మరలా జగనన్నను ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు.

ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, వైస్ ఎంపీపీలు లలిత, ఆనందరావు, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, లచ్చన్న, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మొద్దు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సొర్రు, నాయకులు శ్రీరాములు, శాంతి, లీలారాణి, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులు పదికి పది గ్రేడ్ పాయింట్ల సాధనే లక్ష్యంగా ప్రత్యేక బోధన అందిస్తున్నామని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఆయన కొద్దిసేపు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించారు. వివిధ పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. వారి సామర్థ్యం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న హిమోగ్లోబిన్ పరీక్షలు, వైద్య సేవలపై ఆరా తీశారు.

విద్యార్థులకు అదనపు స్టడీ మెటీరియల్, దుప్పట్లను పీవో పంపిణీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, మెనూ సక్రమంగా అమలు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై వసతి గృహ పర్యవేక్షకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూవో ఎల్. రజని, పాఠశాల హెచ్‌ఎం సింహాచలం పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, రెవరెండ్ యేసుపాదం, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు

పాడేరు రూరల్ : క్రీస్తు బోధనలు అనుసరణీయమని, ప్రతి ఒక్కరు భక్తి మార్గం నడవాలని తద్వార మానసిక ప్రశాంతత చేకూరుతుందని, క్రీస్తు గిరిజనులపై ఎల్లప్పుడు ఉండాలని పాడేరు ఎమ్మెల్యే, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మారుమూల సలుగు పంచాయతీ రెల్లమామిడి గ్రామంలో రక్షణ సువార్త సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ ఆరాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, లవ్ ఆండ్ కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, అంతర్జాతీయ సువార్తకులు రెవరెండ్ డాక్టర్ పి.ఏసుపాదం, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నర్సింగరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక ఆరాధనాలు, ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. 40 మంది దైవ సేవకులకు బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యేసుపాధంను ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నర్సింగరావు దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం విందు భోజనాలు ఆరగించారు. దైవజనులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఘనంగా సహస్ర దీపార్చన



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన శివలింగానికి పాలాభిషేకం అనంతరం శివలింగం, వినాయక, ఓంకారం, చక్రం, నామాల ఆకారాలను పుష్పాలతో అలంకరించారు. అనంతరం మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు రామం,ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు,ఇతర ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య

ఐటీడీఏ పీవో అభిషేక్



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ ఆదేశించారు. మంగళవారం ఐటీడీఏ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో 11 మండలాల సహాయ గిరిజన సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షల కోసం హెచ్‌ఎంలకు సమాచారం అందితే ఏటీడబ్ల్యూఓల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా ఇప్పటి ఏడాది విద్యా సంవత్సరంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మృతి చెందిన విద్యార్థుల వివరాలు, మృతికి గల కారణాలపై ఆరా తీశారు. విద్యార్థులు మృతి చెందితే ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మట్ ప్రకారం ఖచ్చితమైన నివేదిక అందజేయాలన్నారు. ఏటీడబ్ల్యూఓలు ప్రతి రోజు ఒక ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేయాలన్నారు. జీపీఎస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులపై అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న చోట్ల సీఆర్టీల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆశ్రమ వసతి గృహాలకు టెండర్‌లో ఖారారు చేసిన నిత్యావసర సరకులు సరఫరా చేయాలని నిల్వ సరుకులు సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, 11 మండలాల ఏటీడబ్ల్యూఓలు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగుల చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న దాతలు

రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దివ్యాంగుల ట్రాన్స్ జెండర్స్ మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకు జె.మధవి, ఎంపీపీ శ్రీదేవి, జెట్పీటీసీ కుమారి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, హాజరైయ్యారు. తొలిత దివ్యంగులకు పలు ఆటలపోటీలు నిర్వహించి, గెలిపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైయిన మధవి మాట్లాడుతూ మా శాఖ తరుపున దివ్యంగులకు కావల్సిన పునారావస కార్యక్రమాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ఉమా ఏడ్యుకేషనల్ ఆండ్ టెక్నికల్ సోసైటీ ఫాండర్ ఎస్‌పీ రెడ్డి మాట్లాడుతూ 750 మంది దివ్యాంగులకు అవసరమైన విద్య, వైద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం దివ్యంగులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి పాల్గొన్నారు.

పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రామచంద్రరావు

సాక్షి, పాడేరు: విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఎంఈవో ఎస్. రామచంద్రరావు ఉపాధ్యాయ వర్గాలను ఆదేశించారు.స్థానిక శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంఈవోలు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎంలంతా తమ స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని పాఠశాలలను సందర్శించి, విద్యా కార్యక్రమాలను సమీక్షించాలన్నారు. ఉపాధ్యాయుల పాఠ్యాంశాల బోధన ప్లాన్, విద్యార్థులు రాస్తున్న వర్క్‌బుక్‌లను తనిఖీ చేయాలని ఆయన సూచించారు.జి.మాడుగుల ఎంఈవో బాబూరావు మాట్లాడుతూ చదువులలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులంతా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు.తలారిసింగి పాఠశాల హెచ్‌ఎం రీమలి జాన్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల తేదీలు ఖారారైనందును విద్యార్థులకు ప్రత్యేక బోధన కార్యక్రమాలు చేపట్టాలని, ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంతో ఉపాధ్యాయులంతా శ్రమించాలని ఆయన కోరారు.

15న జాబ్‌మేళా

సాక్షి,పాడేరు: పాడేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను నామె మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. టెన్త్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, పీజీ, పీహెచ్‌డీ చదివిన అభ్యర్థులంతా జాబ్‌మేళాకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆమె కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షురాలు సరస్వతి, సభ్యుడు మినుముల కన్నాపాత్రుడు, కుజ్జెలి సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, పాస్టర్ మోద బాబూరావు, పెదబయలు మాజీ ఎంపీపీ జర్సింగి సూర్యనారాయణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి పిట్టా నవీన్ పాల్గొన్నారు.

‘అనంత’ కాంతులు

గిరి పరిసరాలు.. చిమ్మ చీకట్లో వెలుగు దివ్వెల కాంతికి నూతన శోభను సంతరించుకున్నాయి. దేవ దేవుడైన అనంత పద్మనాభ స్వామి నామస్మరణతో మార్మోగాయి. పోటెత్తిన భక్తులతో అనంత పద్మనాభుని గిరి భక్త జన సాగరంగా మారింది. వేల దీప కాంతులు వెదజల్లిన ఆధ్యాత్మిక సుగుంధాలకు భక్తులు పులకాంకితులయ్యారు. ఇది పద్మనాభం గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన అనంత పద్మనాభ స్వామి దీపోత్సవ వైభవం.



భక్తులతో కిక్కిరిసిన పద్మనాభస్వామి గిరి



దీప కాంతులతో అనంతుని గిరి

పద్మనాభం : రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం మంగళవారం కనుల పండువగా జరిగింది. తైల దీపాలు వెదజల్లిన సింధూర వర్ణపు కాంతులతో అనంత పద్మనాభుని గిరి దేదీప్య మానంగా వెలుగొందింది. అనంతుని దీపోత్సవ దీప్తి దశ దిశల వ్యాపించి భక్తులకు ఆధ్యాత్మిక పారవశ్యాన్ని కల్పించింది. గిరి శిఖరాన ఉన్న అనంత పద్మనాభుడు, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 4 గంటల నుంచే భక్తుల తాకిడి కనిపించింది. మధ్యాహ్నం 3 గంటలకే పద్మనాభం రోడ్లన్నీ భక్తజన సందోహంతో నిండిపోయాయి. ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడి మరి మెట్లను రిజర్వ్ చేసుకున్నారు. కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి భూదేవి సమేతడైన అనంత పద్మనాభుని ఉత్సవ విగ్రహాలను వేద పండితుల వేద మంత్రోచ్చరణలు, నాద స్వర వాయిద్యాల నడుమ గరుడ వాహనంపై తోడ్కొని వచ్చి విశేష పూజలు నిర్వహించారు. గిరిని అధిరోహించే ముందు భక్తులు తొలి పావంచా వద్ద కొలువు దీరిన స్వామిని దర్శించుకున్నారు.

సాయంత్రం 5 గంటలకు గిరిపై జేగంట మోగగానే భక్తులు 1,288 మెట్లకు ఇరువైపులా తైల దీపాలను వెలగించారు. తైల దీపాలంకరణతో అనంత పద్మనాభుని గిరికి సింధూర తోరణాలు అద్దినట్టు సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. దీపోత్సవాన్ని కనులారా వీక్షించిన భక్తులు పరవశించిపోయారు. ఈ సందర్భంగా బారి మందుగుండు సామగ్రి కాల్చారు. కోలాటం, తప్పెటిగుళ్లు, పులివేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సారి ఘాట్ రోడ్డు ద్వారా కాలినడకన వెళ్లే భక్తులకు గిరిపైన అనంత పద్మనాభ స్వామిని దర్శించుకునే భాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రథమ పావచంచా వద్ద పూజలు నిర్వహించి దీపం వెలిగించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై 17 నుంచి ధనుర్మాసోత్సవాలు



సింహాద్రి అప్పన్న

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 17 నుంచి ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మంగళవారం తెలిపారు. అలాగే సింహగిరిపై ఈ నెలతో పాటు వచ్చే జనవరిలో జరిగే పలు విశేష ఉత్సవాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ నెల 17న ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని, ఆ రోజు తెల్లవారుజామున సింహగిరిపై రాజగోపురంలో నెలగంట మోగించనున్నట్టు పేర్కొన్నారు. అప్పన్న స్వామికి, గోదాదేవికి విశేష పూజలు, తిరువీధి నిర్వహిస్తామన్నారు.

- ఆలయంలో ఈ నెల 13 నుంచి 22 వరకు పగల్‌పత్తు ఉత్సవాలు జరుగుతాయన్నారు. రోజూ ఉదయం స్వామివారికి తిరువీధి ఉత్సవం జరుపుతామని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్జిత సేవలను రద్దు చేశామన్నారు.
- ఈ నెల 23 నుంచి జనవరి 2వ తేదీ వరకు ఆలయంలో రాపత్తు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. రోజూ సాయంత్రం 5 గంటలకు స్వామికి తిరువీధి ఉంటుందని, ఈ ఉత్సవాలు సందర్భంగా రాత్రి 7 గంటల వరకే భక్తులకు దర్శనాలు లభించనున్నట్టు పేర్కొన్నారు.
- వచ్చేనెల 11 నుంచి 15వ తేదీ వరకు రోజూ ఉదయం సింహగిరిపై గంగధార వద్ద స్వామికి ధారోత్సావాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జనవరి 11 నుంచి 15వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్టు ఈవో తెలిపారు.



గోదాదేవి